సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

epaper.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way

సంపుటి : 02 | సంచిక : 96 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | మంగళవారం | 05.08.2025



### గులాబీ గూటికి
## గుడ్ బై

- బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

2వ పేజీ



### కాళేశ్వరం నివేదికకు
# కేబినెట్ ఒకే..!

- అన్ని రాజకీయ పార్టీల అభిప్రాయాలను తీసుకుంటాం
- లక్ష కోట్ల ప్రాజెక్టు కుంగిపోవడం బాధాకరం
- అసెంబ్లీలో చర్చకు పెడతాం.
- మీడియా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

2లో

# విద్యార్థుల భవిష్యత్తుపై సర్కారు ప్రత్యేక దృష్టి

- ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్



3లో

విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ తెలిపారు. సోమవారం పట్టణంలోని హనుమకొండ రోడ్డులో ఉన్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌ను కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తో కలిసి ఆయన పర్యవేక్షించారు.

### 'ధర్మ' దౌర్జన్యాలను
## అడ్డుకోవాలి

- జనగామలో సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన



2లో

wanted

విలేకరులు కావలెను

మన చౌరాస్తా తెలుగు దినపత్రిక స్థాపించిన అనతి కాలంలోనే పాఠకుల విశేష ఆదరణ పొందుతూ డిజిటల్ మీడియా రంగంలో దూసుకెళ్తోంది. స్థానిక సమస్యలపై, రాజకీయ, ఎడ్యుకేషన్, ఆరోగ్యం, సినిమా వార్తలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతూ ముందుకు సాగుతోంది. మా పత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను.. పూర్తి వివరాలకు ఈ కింది నంబర్లలో సంప్రదించగలరు.

manachourasta@gmail.com

8555800812 9676400812

సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

మన చౌరాస్తా

The Complete News way

# ‘ధర్మ’ దౌర్జన్యాలను అడ్డుకోవాలి

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ పట్టణంలో పేదల ఇండ్లను కూలగొట్టిన ధర్మ కృష్ణారెడ్డి అరెస్టు చేయాలని, ఆయన దౌర్జన్యాలను అడ్డుకోవాలని సీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహిచారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొట్ల శేఖర్, సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ మాట్లాడుతూ పట్టణంలో 400 సర్వే నెంబర్లు లో 2002-2006లో లేఅవుట్ ప్లాటింగ్ కొడితే అక్కడ కొంత మంది ఆటో కార్మికులు, హమాలీ కార్మికులు, పేద రైతులు, ఒంటరి మహిళలు కొనుక్కున్నారని తెలిపారు. ఆ ప్లాట్లల ఇల్లు కట్టుకుంటే ధర్మ కృష్ణారెడ్డి అనే వ్యక్తి ఆ భూమి తనదేనని కొంతమంది ఆయన అనుచరులుతో దౌర్జన్యాలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. తక్షణమే కృష్ణారెడ్డి, ఆయన అనుచరులను అరెస్టు చేసి కేసు నమోదు చేయాలసి పేదలకు న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా వారు బాధిత ప్లాట్ యజమానులు, వారి కుటుంబ సభ్యులతో నెహ్రూ పార్క్ నుంచి డీసీపీ ఆఫీసు వరకు సీపీఎం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి డీసీపీ రాజ మహేంద్ర నాయక్‌కు ఫిర్యాదు చేశారు. ఇండ్ల కూల్చివేతకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని వ్యక్తులందర్నీ కస్టడీకి తీసుకుంటామని డీసీపీ బాధితులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి, పల్లెల లలిత, ధర్మ బిక్షం, అజ్మీరా సురేష్ నాయక్, కనకాచారి, శివ, సమ్మయ్య, గాజుల నాగరాజు, గట్టయ్య, బంద్రు సత్తయ్య, మంజుల లక్ష్మి, ప్రసాద్, పరశురాములు, నాగరాజు, గంగరబోయిన మల్లేష్‌రాజ్, సుమ, మల్లేష్, రాజు, ఆర్య పాల్గొన్నారు.








# కాళేశ్వరం నివేదికకు కేబినెట్ ఒకే..!

- అన్ని రాజకీయ పార్టీల అభిప్రాయాలను తీసుకుంటాం
- లక్ష కోట్ల ప్రాజెక్టు కుంగిపోవడం బాధాకరం
- అసెంబ్లీలో చర్చకు పెడతాం.
- సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన

**హైదరాబాద్, మన చౌరాస్తా :** కాళేశ్వరం కమిషన్ చైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్ సమర్పించిన నివేదికకు రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపిందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడిరచారు. దీనిని అసెంబ్లీలో పెడతామని అన్నారు. విచారణకు సంబంధించిన వివరాలను కమిషన్ విశ్లేషణాత్మకంగా నివేదికలో పొందుపరిచిందని చెప్పారు. క్యాబినెట్ భేటీ అనంతరం మంత్రులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో సీఎం మాట్లాడారు. కాళేశ్వరం కమిషన్ నివేదికను త్వరలో అసెంబ్లీలో ప్రవేశపెడతామని రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దీనిపై అన్ని రాజకీయ పార్టీలు తమ అభిప్రాయాలను చెప్పేందుకు అవకాశం ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నాక భవిష్యత్తు కార్యాచరణతో పాటు కమిషన్ సూచనలను అమలు చేసేందుకు ముందుకెళ్తామని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. ఎవరిపైనా కక్ష సాధింపులు, వ్యక్తిగత ద్వేషం తమ ఉద్దేశం కాదనే అన్ని వివరాలనూ మీడియా ముందు ఉంచామని తెలిపారు. ‘జలవనరుల కోసం కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో దాదాపు రూ.లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం మేడిగడ్డ కుంగిపోయే ప్రమాదంలో పడింది. అందుకే రాష్ట్ర ప్రభుత్వం ప్రజాధనం దుర్వినియోగాన్ని దృష్టిలో పెట్టుకొని న్యాయ విచారణ కోసం జస్టిస్ పీసీ ఘోష్‌ను నియమించాం. ఘోష్ కమిషన్ అందరితో మాట్లాడి ప్రభుత్వానికి నివేదికను సమర్పించింది. ఇందులో రాజకీయ ఆరోపణలు లేవు. ఇది ప్రభుత్వం ఇచ్చిన రిపోర్టు కాదు.. స్వతంత్ర న్యాయ విచారణ కమిషన్ ఇచ్చిన రిపోర్టు. కాళేశ్వరం నిర్మాణం, నిర్వహణ అవకతవకలు అన్నింటికీ బాధ్యుడు, జవాబుదారీ అప్పటి సీఎం కేసీఆరే అని నివేదికలో పేర్కొన్నారు. నిపుణుల కమిటీ సూచనలకు కాకుండా సొంత నిర్ణయంతోనే మేడిగడ్డ వద్ద బ్యారేజీని నిర్మించారు. రాష్ట్ర ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరించారు. అవినీతి, ఆశ్రిత పక్షపాతంతో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని ఆరోపించారు. కాళేశ్వరం అవకతవకలపై విచారణ చేయిస్తామని మేనిఫెస్టోలో చెప్పామని, కమిషన్ చైర్మన్‌గా వ్యవహరించిన పీసీ ఘోష్ నిబద్ధత ఉన్న వ్యక్తి..’ అని రేవంత్ చెప్పారు. కేసీఆర్, హరీష్ రావు సహా అనేక మందిని ఘోష్ విచారించారని, 16 నెలల విచారణ తరువాత 665 పేజీల నివేదిక ఇచ్చారని సీఎం తెలిపారు. ఊరు, పేరు, అంచనాలు మార్చి అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని.. అలా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్ వారి హయాంలోనే కూలిపోయిందని సీఎం విమర్శించారు. వైఎస్ఆర్ సీఎంగా ఉన్నప్పుడు ప్రాణహిత చేవెళ్లను ప్రారంభించారని, రీడిజైనింగ్ పేరుతో కేసీఆర్ డిజైన్లను మార్చారని ఆరోపించారు. ప్రాజెక్ట్ నిర్మించిన మూడేళ్ల లోపే మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయిందని సీఎం గుర్తు చేశారు. అన్నారం, సుందిళ్లలో కూడా లోపాలున్నాయని రిపోర్ట్ ఇచ్చిందని సీఎం రేవంత్ చెప్పారు. కాళేశ్వరం కమిషన్ నివేదికపై అసెంబ్లీలో చర్చిస్తామని, త్వరలోనే అసెంబ్లీకి నివేదికను రిపోర్ట్ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అన్ని పార్టీల సూచనలు, అభిప్రాయాలు తీసుకుంటామని సీఎం తెలిపారు. అందరి ఆమోదం మేరకు ఏం చేయాలో నిర్ణయిస్తామని రేవంత్ చెప్పారు. ప్రజాప్రతినిధులకు కమిషన్ నివేదిక ఇస్తామని, అందరూ స్వేచ్ఛగా అభిప్రాయాలు చెప్పొచ్చని సీఎం రేవంత్ వెల్లడిరచారు. ఎవరి పైనా వ్యక్తిగత ద్వేషంతో నిర్ణయాలు తీసుకోవడం లేదని, కమిషన్ రిపోర్ట్‌పై ఎవరు ఏ రకంగా మాట్లాడతారనేది వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

## రూ.84 వేల కోట్ల అప్పు

**మంత్రి ఉత్తమ్ కేమార్ రెడ్డి**

కాళేశ్వరం ప్రాజెక్టు కోసం గత పాలకులు అధిక వడ్డీలతో రూ.84వేల కోట్ల అప్పు తెచ్చారని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. రూ.38 వేల కోట్లతో తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు చేపట్టాల్సి ఉండగా.. మేడిగడ్డకు మార్చారని చెప్పారు. భారీగా తెచ్చిన అప్పులతో చేపట్టిన కాళేశ్వరం.. భారత రాష్ట్ర సమితి హయాంలోనే కూలిపోయిందన్నారు. మేడిగడ్డ బ్యారేజ్‌పై న్యాయ విచారణ చేయిస్తామని గతంలోనే హామీ ఇచ్చాం. అధికారంలోకి వచ్చాక జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో న్యాయ విచారణ చేపట్టాం. రాజకీయ అంశాలు జోడిరచకుండా విచారణ జరపాలని కోరాం. 660 పేజీలతో నివేదికను కమిషన్ నీటిపారుదల శాఖకు ఇచ్చింది. నివేదికను ముగ్గురు అధికారుల కమిటీ 25 పేజీలతో సంక్షిప్తం చేసింది.

# గులాబీ గూటికి.. గువ్వల గుడ్ బై

**బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన మాజీ ఎమ్మెల్యే**



**మహబూబ్‌నగర్, మన చౌరాస్తా :** భారత్ రాష్ట్ర సమితి పార్టీకి మాజీ ఎమ్మెల్యే, నాగర్‌కర్నూల్ జిల్లా పార్టీ అధ్యక్షుడు గువ్వల బాలరాజు గుడ్ బై చెప్పారు. సోమవారం తన పదవులు, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నిర్ణయం సులభం కాదని, ముఖ్యంగా ఐక్యత అవసరమైన ఈ సమయంలో బాధతో తీసుకున్న నిర్ణయమని ఆయన స్పష్టం చేశారు. గువ్వల బలరాజు తన రాజీనామా వెనుక ఎటువంటి నిందలు లేవని, కేవలం గౌరవం, కృతజ్ఞతతోనే పార్టీకి వీడ్కోలు చెబుతున్నానని చెప్పారు. ‘ఇది బాధతో కూడిన రాజీనామా కానీ పార్టీ పట్లనా గౌరవం మారదని తుది వాక్యంలో పేర్కొన్నారు. ఇదిలా ఉంటే.. ఈనెల 9న గువ్వల బాలరాజు బీజేపీలో చేరనున్నట్టు ప్రచారం జరుగుతోంది.

# రావులపల్లిలో స్థానిక ఎన్నికలు బహిష్కరించాలి




**తుంగతుర్తి, మన చౌరాస్తా :** ఎన్నో ఏళ్లుగా అభివృద్ధి నోచుకోని సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం రావులపల్లిలో స్థానిక ఎన్నికలు బహిష్కరించాలని సామాజిక కార్యకర్త చింతకుంట్ల చింతయ్య కోరారు. గ్రామంలో కుంటు పడిన అభివృద్ధిపై కలెక్టర్‌కు వినతి పత్రం అందించేందుకు సోమవారం ఆయన రావులపల్లి నుంచి సూర్యాపేటకు పాదయాత్రగా బయలుదేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ నియోజకవర్గమైన తుంగతుర్తిలో గెలిచిన ఎమ్మెల్యే ఇప్పటి వరకు తమ గ్రామాన్ని పట్టించుకోలేదని ఆరోపించారు. ఎన్ని ప్రభుత్వాలు మారిని తమ గ్రామ పరిస్థితి మారడం లేదన్నారు. ఇప్పటి వరకు గ్రామంలో అంగన్‌వాడీ భవనం లేదు, పశువైద్యశాల లేదు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేదు, పోస్టాఫీస్ లేదు, రేషన్ షాపు లేదు, డబుల్ బెడ్ రూం ఇవ్వలేదు, మూడెకరాల భూమి రాలేదు, మిషన్ భగీరథ నీళ్లు రావడంలేదని ఆయన పేర్కొన్నారు. తమ ఎలాంటి సౌకర్యాలు కల్పించని ప్రభుత్వం, అధికారులు కేవలం 1500 ఓట్ల కోసం తమ గ్రామంలో ఎన్నికలు నిర్వహిస్తున్నారని అన్నారు. గ్రామాన్ని అభివృద్ధి చేసే వరకు ఇక్కడ ఎన్నికలు బహిష్కరించాలని కోరారు.

# కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటా : ఎర్రబెల్లి




**పాలకుర్తి, మన చౌరాస్తా :** బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటానని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. సోమవారం జనగామ జిల్లా పాలకుర్తి మండలం దర్దేపల్లి గ్రామ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వేల్పుల సోమనాథం సతీమణి ఎల్లమ్మ ఇటీవల అనారోగ్యం తో మరణించగా వారి కుటుంబ సభ్యులను, గ్రామ పార్టీ యూత్ నాయకుడు నిమ్మల కుమార్ ఇటీవల అనారోగ్యంతో మరణించగా వారి ఇంటికి వెళ్లి మృతుల చిత్రపటాలకు పూల మాల వేసి నివాళులరపించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, మనో ధైర్యాన్ని ఇచ్చారు. ఆయన వెంట మండల, గ్రామ స్థాయి నాయకులు, యూత్ నాయకులు, సోషల్ మీడియా నాయకులు ఉన్నారు.

# 8వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు




**జనగామ, మన చౌరాస్తా :** జనగామ కలెక్టర్ కార్యాలయం ఎదురుగా గానుగుపహాడ్ ,చిటకోడూర్ వంతెనలు నిర్మించాలని సాధన సమితి అధ్యక్షుడు యాసారపు కరుణాకర్, ప్రధాన కార్యదర్శి ఇరుగు సిద్దులు ఆధ్వర్యంలో చేస్తున్న రిలే నిరాహార దీక్షలు 8వ రోజుకు చేరుకున్నాయి. సోమవారం దీక్షలో సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ తెలంగాణ స్టేట్ ఉమెన్స్ వింగ్ చైర్మన్ డాక్టర్ బి. నవ్య, శ్రీలలిత, జనగామ హ్యూమన్ రైట్స్ చైర్మన్ బానోత్ అరుణ్ కుమార్, వైస్ చైర్మన్ రమావత్ తిరుపతి, ఆర్ టి ఐ చైర్మన్ ఉమాపతి, కన్జ్యూమర్ చైర్మన్ బి.రాజు, నితీష్, సీపీఎం జనగామ మండల కార్యదర్శి బోడ నరేందర్, ఉపేందర్, తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ యాదవ్, ప్రధాన కార్యదర్శి మంచికట్ల రాజేష్, కోశాధికారి నవీన్ చారి, సహాయ కార్యదర్శి, అఫ్రోజ్, మాజీ ఎంపీపీ బైరగోని యాదగిరి గౌడ్, ఉపేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.







# విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యం

## ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్

**జనగామ, మన చౌరాస్తా :**

విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ తెలిపారు. సోమవారం పట్టణంలోని హనుమకొండ రోడ్డులో ఉన్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌ను కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తో కలిసి ఆయన పర్యవేక్షించారు. తొలుత రెసిడెన్షియల్ స్కూల్ వద్ద కు చేరుకున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కలెక్టర్ రిజ్వాన్ భాషా మొక్కను అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వన మహోత్సవాన్ని పురస్కరించుకొని వారు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం పాఠశాలలో భోజనశాలను సందర్శించి పరిశుభ్రతను పరిశీలించారు. వంటగదిని సందర్శించి వండిన ఆహార పదార్థాలను పరిశీలించారు. విద్యార్థుల కోసం తెప్పించిన వంట సామాగ్రి స్టాక్ రూమును సందర్శించి వస్తువుల నాణ్యతను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేస్తూ వారిత మాట్లాడారు. భోజనం బాగుంటుందా.. మెను ప్రకారంగా ఆహారం పెడుతున్నారా.. అని ఆరా తీశారు. ఈ సందర్భంగా అరవింద్ కుమార్ విద్యార్థులతో శ్రద్ధగా చదువుకోవాలని, క్రమశిక్షణతో మెలగాలన్నారు. ప్రభుత్వం విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కొరకు ఆర్థికంగా చేయూతను అందిస్తున్నందున ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, ఉన్నత చదువు లు అభ్యసించి నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించాలన్నారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, జిల్లా బాలికల పర్యవేక్షణ అధికారి గౌసియా బేగం, సివిల్ సప్లై డీటీలు శ్రీనివాస్, లచ్చు నాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

# గ్రీవెన్స్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

## కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**జనగామ, మన చౌరాస్తా :** గ్రీవెన్స్ సెల్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్లు పింకేష్ కుమార్, రోహిత్ సింగ్‌తో కలిసి ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి పలు దరఖాస్తు లను స్వీకరించారు. మరిగడి లో చెరువు పూడ్చి వేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని శ్రీనివాస్, ప్రియాంక, కిష్టయ్య దరఖాస్తు అందించారు. బచ్చన్నపేటకు చెందిన చల్లా వసంత తాము నిరు పేదలమని, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరింది. లింగాలఘణపురం మండలం నెల్లుట్లకు చెందిన సంభోజు






నరసింహస్వామి తన దరఖాస్తు అందిస్తూ.. తన భూమిని ఇతరులు పట్టా చేయించుకున్నారని చర్యలు తీసుకోవాలని కోరారు. జనగామ పట్టణంలోని సాయి నగర్‌కు చెందిన బందారపు లక్ష్మయ్య మిషన్ భగీరథ కనెక్షన్ ఇప్పించాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ త్వరిగతిన సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, గ్రామీణాభివృద్ధి అధికారిణి వసంత, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏ.ఓ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.



# వీహెచ్‌పీ ఆధ్వర్యంలో హరిత సంకల్పం

**జనగామ, మన చౌరాస్తా :** జిల్లా కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో విశ్వహిందూ పరిషత్, దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో 'హరిత సంకల్పం' పేరుతో వన మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు దేవాలయ ప్రాంగణంలో పలు మొక్కలు నాటారు. అనంతరం వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి డాక్టర్ మోహనకృష్ణ భార్గవ మాట్లాడుతూ వృక్ష సంపదను పెంపొందిస్తూ పర్యావరణ సమతుల్యతను సాధించడం, ప్రకృతి పర్యావరణాలను పరిరక్షించడం, ఆధ్యాత్మిక దైవీక వృక్షాలు, ఔషదీ మొక్కల గురించి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ హరిత సంకల్పం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆలయ గౌరవాధ్యక్షుడు గజ్జెల నర్సిరెడ్డి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు ఒక మొక్క నాటి దానికి పోషించాలని, ఆ మొక్క తమ గుర్తుగా అనేక రకాలుగా సమాజానికి ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో పాశం శ్రీశైలం, గోవర్థన్, యాదగిరి, హనుమా రెడ్డి, అనిల్, సాయి సుజీత్, నాగమణి, జక్క జ్యోతి, ధనలక్ష్మి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

# భూ సమస్యలను పరిష్కరించాలి



**దేవరుప్పుల, మన చౌరాస్తా :** భూ భారతి ద్వారా భూ సమస్యలను పరిష్కరించాలని దేవరుప్పుల మండల సీపీఎం(ఐ) పార్టీ ఆధ్వర్యంలో దేవరుప్పుల మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నల్ల అండాలుకు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సింగారపు రమేష్ పాల్గొని మాట్లాడుతూ మండలంలోని 32 గ్రామాల ప్రజల ద్వారా 2300 దరఖాస్తులలో పురోగతిని పెంచాలని, భూ సమస్యల గల కుటుంబాలు ఆయోమయంలో ఉన్నారని, వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఇంటి వెంకటరెడ్డి, పార్టీ మండల నాయకులు రెడ్డిరాజుల నారాయణ, సి.హెచ్ మైసయ్య, గొడిశాల రాములు పాల్గొన్నారు.




# ఢిల్లీకి దారిపట్టిన జిల్లా కాంగ్రెస్ నేతలు

**జనగామ, మన చౌరాస్తా :** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ ఢిల్లీలో కాంగ్రెస్ చేపట్టే ఆందోళనకు జనగామ నుంచి ఆ పార్టీ నేతలు తరలివెళ్లారు. జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, నియోజకవర్గ ఇంచార్జ్ కొమ్మూరి ప్రతాప్ రెడ్డి నాయకత్వంలో చర్లపల్లి రైల్వే స్టేషన్ నుంచి ప్రత్యేక ట్రైన్ లో రాష్ట్ర ముఖ్య నాయకులతో కలిసి బయలుదేరారు. వెళ్లిన వారిలో జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, ఎన్ఎస్‌యూఐ ఉమ్మడి మాజీ జిల్లా అధ్యక్షుడు జక్కుల వేణుమాధవ్, జిల్లా జనరల్ సెక్రటరీ అలేటి సిద్దిరాములు, నర్మెట్ట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజబోయిన లక్ష్మీ నారాయణ, చేర్యాల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దాసరి శ్రీకాంత్, నాయకులు తోట సత్యం, మంత్రి శ్రీశైలం, ఎదునూరి రవీందర్, జ్యోతి భాస్కర్, మాజీ సర్పంచ్ వేముల వెంకటేష్, తోట హేమలత, తాటికొండ సదానందం, కరుణాకర్ ఉన్నారు.



# విద్యారంగంపై ప్రభుత్వ ప్రత్యేక దృష్టి

## స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే శ్రీహరి



**జనగామ, మన చౌరాస్తా :** రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అత్యధిక ప్రాముఖ్యత ఇస్తుందని, విద్యార్థులకు నాణ్యమైన ప్రమాణాలతో కూడిన విద్యను అందించేందుకు కృషి చేస్తోందని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్‌ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. జనగామ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్, అదనపు కలెక్టర్, ఇంచార్జ్ డీఈవో పింకేష్ కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే నియోజకవర్గంలోని అన్ని రెసిడెన్షియల్ విద్యాసంస్థల ప్రగతిని ప్రిన్సిపాల్స్, స్పెషల్ ఆఫీసర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి నియోజకవర్గంలోని అన్ని రెసిడెన్షియల్ పాఠశాలల పని తీరు, నిర్వహణ, పాఠశాలలో నెలకొన్న సమస్యలు, ఏర్పాటు చేయాల్సిన వసతులను ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్స్ ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కడియం మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని రెసిడెన్షియల్ పాఠశాలలకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయాలన్నారు. అన్ని రెసిడెన్షియల్ పాఠశాలలో తప్పనిసరిగా సిసి కెమెరాలాను వెంటనే ఏర్పాటు చేయాలని, జఫర్ గడ్, స్టేషన్ ఘనపూర్ కేజీబీవి, మాడల్ స్కూల్స్ కి అప్రోచ్ రోడ్లను నిర్మాణం చేయాలని సూచించారు. హన్మకొండ హంటర్ రోడ్డులో ఉన్న ధర్మసాగర్ సోషల్ వెల్ఫేర్ పాఠశాలను వెంటనే వేరే భవనానికి మార్చాలన్నారు. అన్ని బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో వాటర్ హిటర్స్, హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని, విద్యార్థులకు నాణ్యతతో కూడిన భోజనం అందించాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ప్రతీ విద్యార్థిపై వ్యక్తిగత పర్యవేక్షణ ఉండాలన్నారు. సమావేశంలో హన్మకొండ డీఈవో వాసంతి, ఎంఈవోలు, అన్ని రెసిడెన్షియల్ పాఠశాలల స్పెషల్ ఆఫీసర్లు, ప్రిన్సిపాల్స్, ఇతర విద్యా శాఖ అధికారులు పాల్గొన్నారు. అనంతరం నీటిపారుదల శాఖ అధికారులతో ఎమ్మెల్యే కడియం సమీక్షా సమావేశం నిర్వహించారు.

# నేడు భారీ వర్షాలు

**హైదరాబాద్, మన చౌరాస్తా :** తెలంగాణ అంతటా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. రాష్ట్రం మొత్తం ఎల్లో అలర్ట్ జారీ చేసింది.. అయితే, కొన్నిచోట్ల అది ఆరెంజ్ అలర్ట్ మారే అవకాశం కనిపిస్తోంది. గంటకు 40 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీయడంతో ఉరుములు మెరుపులతో కుండపోత వర్షం కురుస్తుందంటున్నారు వాతావరణ శాఖ అధికారులు. మంగళవారం రాష్ట్రంలోని మేడ్చల్ మల్కాజిగర్, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగామ, సిద్ధిపేట, యాదాద్రి భువనగరి, వికారాబాద్, మెదక్, కామారెడ్డి జిల్లాలలో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

# ఇండ్ల నిర్మాణ పనుల్లో జాప్యం వద్దు

## ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో ఆలస్యం జరగకుండా చూడాలని, లబ్ధిదారులను ప్రోత్సహిస్తూ వేగవంతంగా ఇంటి నిర్మాణం పూర్తి చేయాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి సూచించారు. సోమవారం స్టేషన్ ఘన్ పూర్ పట్టణ కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నిర్మంచిన ఇందిరమ్మ ఇళ్ల నమూనా కడియం ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఆయన నమూనా ఇంటిని, నిర్మాణ నాణ్యతను పరిశీలిం చారు. ఇందుకు అయ్యే ఖర్చు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే కడియం మాట్లాడుతూ బిల్లుల చెల్లింపుల్లో జాప్యం లేకుండా ఎప్పటికప్పుడు చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని గృహ నిర్మాణ శాఖ అధికారులకు సూచిం చారు.

### -సిందూర హాస్పిటల్ ప్రారంభం



స్టేషన్ ఘన్ పూర్ పట్టణ కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన సిందూర హాస్పిటల్‌ను ఎమ్మెల్యే కడియం శ్రీహరి సోమవారం ప్రారంభించారు. పేద ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని హాస్పిటల్ వైద్యులకు సూచించారు. కార్య క్రమంలో స్టేషన్ ఘన్ పూర్ మార్కెట్ చైర్మన్ లావణ్య శిరీష్ రెడ్డి, ఆర్డీవో వెంకన్న, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు చింతకుంట్ల నరేందర్ రెడ్డి, బెలిదే వెంకన్న, పోగుల సారంగపాణి, కొలిపాక సతీష్, మేకల మల్లేష్, చింత ఎల్లయ్య, గన్ను నర్సింహులు, కిషన్ రాజు, రమే ష్, గుర్రం రాజు, హౌసింగ్ డీఈ, ఏఈలు, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.




# కలెక్టరేట్ ఎదుట రైతు సంఘం నేతల ఆందోళ

- దేవాదుల కాల్వలు పూర్తి చేయాలని డిమాండ్
- కలెక్టర్‌కు వినతి పత్రం అందజేత

**జనగామ, మన చౌరాస్తా :** 20 సంవత్సరాలు గడిచినా పూర్తి కానీ దేవాదుల కాలువతో నీరు అందక రైతుల ఇబ్బందులు పడుతున్నారని రైతు సంఘం నేతలు అన్నారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట రైతులు ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జనగామ, సిద్దిపేట జిల్లా అధ్యక్షులు ఆది సాయన్న, కత్తుల భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ బచ్చన్నపేట మండల శివారు నుంచి ప్రారంభమైన దేవాదుల కాలువ చేర్యాల మండలం నాగపురి గ్రామ శివారులోని గండికుంట వద్దకు వచ్చి 2006 సంవత్సరంలో నిలిపివేశారని, పోతిరెడ్డిపల్లి గ్రామ బయ్యన్న చెరువు వరకు భూములు సర్వే చేసి రైతులకు డబ్బులు కూడ చెల్లించారని, కానీ నేటికి 20 సంవత్సరాలు గడిచినప్పటికీ కాలువ నిర్మాణ పనులు పూర్తి కాకపోవడం విచారకరమన్నారు. ఈ కాల్వ పోతిరెడ్డిపల్లి వరకు పూర్తి చేస్తే సుమారు 700 ఎకరాల భూములకు సాగునీరు అందడమే కాకుండా భూగర్భ జలాలు పెరిగి రైతుల భూములు సాగులోకి వచ్చి సస్యశ్యామలమవుతాయని అన్నారు. వెంటనే కాల్వ పనులు పూర్తి చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎస్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి సొప్పరి సోమయ్య, జిల్లా నాయకులు అందే అశోక్, వలబోజు నరసింహాచారి, రైతులు గూడూరి బాలరాజు, జింకల హరికృష్ణ, బట్టు భాస్కర్, కొక్కొండ రవీందర్, మాడబోయిన నరేష్, జోగు పరశురాములు, అప్పల బాలయ్య, కొక్కొండ పోశయ్య, పోరెడ్డి సత్యనారాయణ, పోరెడ్డి భాస్కర్, పోరెడ్డి అశోక్, అప్పల బాబు, కొక్కొండ మల్లేశం, కొక్కొండ పరమేష్, పాల కమలాకర్, కొక్కొండ భాస్కర్, కొక్కొండ రాజు, బోకూరు భాను ప్రకాశ్ రెడ్డి, కొక్కొండ నరేష్, జట్టి చందు, గర్నపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.